క్లుప్తంగా

గంజాయి స్వాధీనం

డెంకాడ: మండలంలోని గుణుపూరు జంక్షన్ వద్ద ముగ్గురు యువకుల నుంచి 300 గ్రాముల గంజాయిని ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజయనగరానికి చెందిన ముగ్గురు యువకులు గంజాయి సేవించేందుకు వెళ్తుండగా..ముందుగా అందిన సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే రెండు మోటార్ సైకిళ్లు, రెండు మొబైల్ ఫోన్లు సీజ్ చేశామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మూడు కిలోలు..

విజయనగరం క్రైమ్: స్థానిక బాబామెట్ట సమీపంలో ఇద్దరు వ్యక్తుల నుంచి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఖాదర్‌నగర్‌కి చెందిన యల్లాజీ, లెప్రసీ కాలనీకి చెందిన బోని యేసులను అరెస్ట్ చేశామన్నారు. ఆదివారం రాత్రి తనిఖీలు చేపడుతుండగా నిందితులు పట్టుబడ్డారన్నారు.

బీపీ మండల్‌కు నివాళులు..



బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: బిందేశ్వరి ప్రసాద్ మండల్ (బీపీ మండల్) పార్లమెంటేరియన్‌గా, బీహార్ ముఖ్యమంత్రిగా, ఓబీసీల పితామహుడిగా, గొప్ప సంఘసంస్కర్తగా భారతీయులందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని బీసీ సంఘాల జేఏసీ నాయకులు గొలగాన రమేష్, కెల్ల శ్రీనివాసరావు, గొర్లె సూరిబాబు అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ వద్ద బీపీ మండల్ 107వ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముదిలి నాగభూషణం, కొండ్రు శ్రీనివాసరావు, బి.చంద్రనాయుడు, ముసిరాన హరి, ఆర్.కళ్యాణ్, తేజ, తదితరులు పాల్గొన్నారు.

గోతులను పూడ్చరూ..



రామతీర్థం ప్రధాన రహదారిలో ఏర్పడిన గోతులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం ప్రధాన రహదారిలో ఏర్పడిన గోతులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి మధ్యలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలను కలిపే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేలాది మంది ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. రామతీర్థం ప్రధాన వీధిలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరంతా వచ్చి గుంతల్లో చేరుతోంది. మురుగు నీరు నిల్వ ఉండడంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బొబ్బిలి రూరల్: మొక్కలు నాటుతున్న యూటీఎఫ్ సభ్యులు

రాజాం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సంతకవిటి ఎంఈవో బి.శాంతికుమారి, రాజాం పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆర్‌వీజీ నాయుడు అన్నారు. పట్టణంలోని ఆదర్శనగర్‌లో కొల్లూరు జయవర్ధన్ తన పుట్టినరోజు సందర్భంగా కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు జయవర్ధన్‌ను అభినందించి, కాసేపు మాట్లాడారు. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం కారణంగా వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయని, కాలుష్యం తగ్గాలన్నా, మానవ మనుగడ కొనసాగాలన్నా మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. ఖాళీ ప్రదేశాలు, ఇళ్ల పరిసరాల్లో వీలైనంత వరకు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో రాజాం రెడ్‌క్రాస్ ప్రతినిధి కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్య, కొల్లి ఎరుకునాయుడు, అసిరినాయుడు, శ్రీధర్, కొల్లి అప్పారావు నాయుడు, ఏగిరెడ్డి రామారావు, నీలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.విజయకుమారి, తదితరులు పలు మొక్కలు నాటి కాసేపు ప్రసంగించారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయుల మధ్య చదరంగం, టెన్నీకాయిట్, మ్యూజికల్ చైర్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆ తర్వాత ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు పి.కస్తూరి, జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్, గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు రమణమూర్తి, వనమిత్ర కృష్ణదాస్ పాల్గొన్నారు.



సెక్యూరిటీ గార్డులను నియమించాలి..

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో సెక్యూరిటీ గార్డులను నియమించి స్టాఫ్‌కు రక్షణ కల్పించాలి. ఆస్పత్రుల్లో రాత్రివేళల్లో విధులు నిర్వహించినప్పుడు ఆకతాయిలతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ నిర్వహించినప్పుడు ఆస్పత్రులను కూడా పర్యవేక్షించాలి.

–బి. ప్రమీలాదేవి, స్టాఫ్‌నర్స్, పూసపాటిరేగ పీహెచ్‌సీ



చర్యలు చేపట్టాలి..

వైద్యులపై దాడులకు తెగబడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. వైద్య సిబ్బందికి భద్రత కల్పిస్తేనే వారు తమ విధులకు న్యాయం చేయగలరు.

–పి.స్వాతి, స్టాఫ్‌నర్స్, పూసపాటిరేగ పీహెచ్‌సీ



దాతల సహకారం మరువలేనిది

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి దాతల సహకారం మరువలేనిదని అదే గ్రామానికి చెందిన వారణాసి జగన్నాథస్వామి ప్రశంసించారు. ఆదివారం నిత్యాన్నదానానికి హాజరైన 100 మందికి ఆయన అన్నదానం చేయడంతో పాటు వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను అభినందించి, తమకు ఉన్న దానిలో కొంత సాయం చేస్తే దైవానుగ్రహం లభిస్తుందని, ప్రతిఒక్కరూ దానధర్మాలు చేసేందుకు ముందుకురావాలని కోరారు.

పారిశుధ్య నిర్వహణ అధ్వానం

- కార్పొరేషన్ హోదా దక్కించుకున్న నగరంలో అపరిశుభ్రత
- కొరవడుతున్న అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ
- నగరంలో విజృంభిస్తున్న దోమల సంచారం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



నగరంలో ఓ చోట చెత్తాచెదారాలతో నిండిపోయిన కుండీ

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పుతోంది. గడిచిన రెండు నెలలుగా నగరంలో చేపట్టాల్సిన పారిశుధ్య పనులపై పర్యవేక్షణ కొరవడడంతో సుమారు మూడు లక్షల మంది జనాభా ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. కొద్దిరోజుల కిందట నగరంలో నమోదైన డెంగీ కేసులే ఇందుకు తార్కాణంగా నిలుస్తున్నాయి. అయినప్పటికీ అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఫలితంగా కార్పొరేషన్ హోదా దక్కించుకున్న నగరంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిత్యం 120 టన్నుల చెత్త, ఇతర వ్యర్థాలను పారిశుధ్య సిబ్బంది సేకరించి గుణుపూరుపేట డంపింగ్ యార్డ్‌తో పాటు విశాఖకు తరలిస్తున్నారు. ఇందుకు పొరుగు సేవలు, శాశ్వత పద్ధతిపై 633 మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. సేకరించిన చెత్తను చిన్న వాహనాల్లో రింగ్‌రోడ్‌లో గల మినీ డంపింగ్‌యార్డ్ వద్దకు తరలించి.. అనంతరం అక్కడి నుంచి వేరు చేసిన చెత్తను విశాఖ, గుణుపూరుపేట ప్రాంతాలకు తరలిస్తుంటారు. అయితే పారిశుధ్య నిర్వహణలో కీలకమైన క్షేత్ర స్థాయి సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు అధికారుల పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. కొంతమంది రెగ్యులర్ ఉద్యోగులు వేలల్లో జీతాలు తీసుకుని వారి స్థానంలో వేరొకరితో పనులు చేయిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. పనికి వచ్చే తాత్కాలిక సిబ్బంది అసంపూర్ణంగా పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పుతోంది.



కోట జంక్షన్ వద్ద రోడ్డు పక్కనే చెత్తాచెదారాలు

వెనుకబాటును అధిగమించేనా...?

- తడి, పొడి చెత్తను ఇచ్చేందుకు ఆర్థిక సంఘం నిధులతో ఇచ్చిన మూడు రంగుల డబ్బాలను ఉపయోగించాలి. చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేసే కేంద్రాలను ఉపయోగించాలి. ఈ రెండు ప్రక్రియల అమల్లో 60 శాతం సఫలీకృతమవుతుండగా... 100 శాతం అమలయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- ప్లాస్టిక్ నియంత్రణపై ఒక అడుగు ముందుకు... రెండు అడుగులు వెనక్కు అన్న చందంగా మారింది. హోల్‌సేల్ విక్రయాల నియంత్రణలో అధికారుల వైఫల్యం కట్టొచ్చినట్లు కనిపిస్తోంది.
- సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ మాత్రం పూర్తి స్థాయిలో లేదు. మూత్రశాలలు ఏర్పాటు చేయలేకపోయారు.

పట్టించుకోని అధికారులు..

నెల్లిమర్ల: నగర పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది.అధికారుల నిర్లక్ష్యం కారణంగా నగర వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగర పంచాయతీలోని రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా నగర పంచాయతీ ప్రధాన రహదారి పక్కన ఉన్న కాలువ పూడుకుపోవడంతో మురుగు నీరు రహదారిపైకి ప్రవహిస్తోంది. అలాగే మొయిద జంక్షన్ నుంచి జరజాపుపేటకు వెళ్లే రహదారిలో కల్వర్టు పూడుకుపోవడంతో అక్కడ కూడా మురుగునీరు రోడ్డు మీద నిలిచిపోతోంది. దీంతోపాటు దోమల నివారణకు అధికారులు ఫాగింగ్ కూడా చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇందిరాకాలనీ వద్ద కాలువలో పేరుకుపోయిన చెత్త

దృష్టి సారిస్తా..

నగర పంచాయతీలోని పారిశుధ్య పనులు, ఇతర అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తాను. అలాగే దోమల నివారణకు కూడా చర్యలు తీసుకుంటాను.

– టీవీఎస్ విశ్వేశ్వరరావు, కమిషనర్(ఎఫ్ఏసీ), నగర పంచాయతీ,నెల్లిమర్ల.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రఘువర్మ

- ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

విజయనగరం అర్బన్: వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల బరిలో మరోసారి పాకలపాటి రఘువర్మే ఉంటారని ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేశారు. ఉపాధ్యాయుల అందిరితో కలుపుగోలుగా ఉండడం.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ అందరికీ అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్సీ రఘువర్మను రెండోసారి పోటీ చేయడానికి ఏకగ్రీవంగా కమిటీ తీర్మానించింది. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి మాట్లాడుతూ.. పాఠశాలల ఉనికికే ప్రశ్నార్థకంగా మారి ఉపాధ్యాయులు మోయలేని పనిభారాన్ని కల్పిస్తున్న జీఓ 117, జీఓ 128లను తక్షణమే రద్దు చేయాలని కోరారు. పదోన్నతులు కల్పించిన తర్వాత మాత్రమే పని సర్దుబాటు చేయాలన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ బుకారీబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్తేరు శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహనరావు, వివిధ మండల కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా సతివాడ మామిడితోట



ఆకతాయిలు మద్యం తాగే మామిడి తోట ఇదే..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలకు అతి సమీపంలో ఉన్న మామిడి తోట అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఉండడంతో మందుబాబులు మద్యం కొనుగోలు చేసి.. ఆదర్శ పాఠశాలకు ఎదురుగా ఉన్న మామిడితోటలో మద్యం తాగుతున్నారు. దీంతో తమ పిల్లలకు రక్షణ కరువైదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదర్శ పాఠశాలతో పాటు ప్రభుత్వ బాలికల వసతిగృహం, ఉన్నత పాఠశాల, విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రాథమిక ఆస్పత్రి, జూనియర్ కళాశాల వంటి ప్రభుత్వ సంస్థలు ఇక్కడే ఉన్నాయి. పాఠశాలలు విడిచిపెట్టేటప్పుడు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు అక్కడే ఆటోల కోసం నిరీక్షిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మందుబాబులను కట్టడి చేయాలని వారంతా కోరుతున్నారు.

రహదారిని బాగుచేయండి..



రాళ్లు పైకి తేలి దర్శనమిస్తున్న గురుభక్తుల కొండకు వెళ్లే రహదారి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట జంక్షన్ నుంచి గొర్లిపేట జగనన్న కాలనీ, రామతీర్థం బోడికొండకు వెళ్లే రహదారిని బాగు చేయాలని ప్రజలు, సందర్శకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మార్గంలో పురావస్తు శాఖ అధీనంలో ఉండే గురుభక్తుల కొండ, దుర్గా భైరవ కొండ, నీలాచల పర్వతం, తదితర చూడదగ్గ ప్రదేశాలున్నాయి. నిత్యం ఎంతోమంది సందర్శకులు ఆ మార్గంలో ప్రయాణాలు సాగిస్తుంటారు. రహదారిపై రాళ్లు పైకి తేలడంతో గొర్లిపేట జగనన్న కాలనీ వాసులతో పాటు సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి ఏటా ముక్కోటి ఏకాదశి నాడు ఈ రహదారిలోనే భక్తులు గిరి ప్రదక్షణలు కూడా చేస్తుంటారు. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన రహదారిని అభివృద్ధి చేస్తే సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పక్కా రహదారిని నిర్మించాలని కోరుతున్నారు.

అలరించిన రాధాకృష్ణుల వేషధారణలు...



రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

జిల్లా కేంద్రంలోని రింగురోడ్డులో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలంతో సందడి వాతావరణం నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం





అలరించిన చిన్నారుల నృత్యం

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని ఆధ్యాత్మిక వక్తలు రామ్మోహనరావు, దామోదరరావు అన్నారు. మండలంలోని దేవుదల గ్రామంలోని గీతాశ్రమంలో భగవద్గీత పారాయణం ఆదివారం చేపట్టారు. వారు మాట్లాడుతూ భగవద్గీత మోక్ష ప్రదాయిని అని, భగవద్గీత చదివితే మనసు ప్రశాంతంగా ఉండడంతో పాటు ఉత్తమ జీవనం అలవడుతుందన్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

శరవేగంగా సీసీ కాలువల నిర్మాణం

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో ఉన్న దళితవాడలో సీసీ కాలువల నిర్మాణం శరవేగంగా చేపడుతున్నారు. సర్పంచ్ టంకాల ఉమాపాపినాయుడు పర్యవేక్షణలో పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మాణ పనులు చేస్తున్నారు. ప్రధాన కాలువలకు అనుసంధాన కాలువల నిర్మాణం చేపడుతుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంగీత కచేరి..



కీర్తనలు ఆలపిస్తున్న వేదార్చన

విజయనగరం టౌన్: పట్టణ పరిధి కొత్తపేట మంటపం దగ్గర గల ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఆదివారం జరిగిన సంగీత కచేరి ఆహూతులను అలరించింది. ఫ్రెండ్స్ ఫైనార్ట్స్ అసోసియేషన్, రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ సంయుక్త నిర్వహణలో చేపట్టిన కచేరీలో స్విట్జర్లాండ్‌కు చెందిన జి.వేదార్చన పలు కీర్తనలు ఆలపించింది. కార్యక్రమంలో ఫైనార్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, కార్యదర్శి డాక్టర్ మందపాక రవి, సుబ్బారావు, అకాడమీ తరఫున ఉసిరికల చంద్రశేఖరరావు, అధ్యాపకులు శారద, భానుహర్ష, మహేశ్వరరావు, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఈఆర్ సోమయాజులు, తిరుపతికి చెందిన నేమాన వెంకటరమణ, సంగీతాభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో మిగులుసీట్లకు అడ్మిషన్లు

వేపాడ: 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి మండలంలోని బక్కునాయుడుపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 30వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని ప్రిన్సిపాల్ యు.ఉషారాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ విద్యార్థినులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. అయిదోతరగతిలో 35 సీట్లు, ఆరో తరగతిలో 8, ఏడో తరగతిలో 10, ఎనిమిదో తరగతిలో 14, తొమ్మిదో తరగతిలో 13 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో 4 సీట్లు ఖాళీ ఉన్నట్లు వివరించారు.ఆసక్తి ఉన్న విద్యార్థినులు టీసీ, స్టడీ సర్టిఫికెట్, తల్లి,తండ్రి ఆధార్ కార్డు జెరాక్సులు, కుల, ఆదాయం ధ్రువపత్రాలు, అయిదు పాస్ పోర్టు సైజు కలర్ ఫొటోలు తీసుకుని నేరుగా పాఠశాలకు వచ్చి జాయిన్ కావచ్చని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు పదోతరగతి సప్లమెంటరీలో పాస్ అయిన విద్యార్థినులు కూడా అర్హులేనని తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటలతో జీవనోపాధి..

- సమయానికి కురవని వానలు
- వరి నుంచి ఉద్యానవన పంటల వైపు రైతన్న చూపు
- కూరగాయలు, పూలు, పండ్ల సాగుపై కూడా ఆసక్తి



పూసపాటిరేగలో క్యాప్సికమ్ సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

పూసపాటిరేగ : వర్షాభావ పరిస్థితులు.. ప్రతి ఏటా పెరుగుతున్న పెట్టుబడులు.. వరి పంట గిట్టుబాటు కాకపోవడం.. తదితర కారణాలతో రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలవైపు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు దాటుతున్నా వాతావరణం అనుకూలించకపోవడంతో ఖరీఫ్ సాగు మధ్యలోనే ఆగిపోయింది. నియోజకవర్గంలో 25 వేల ఎకరాలలో ఖరీఫ్ సాగు జరగాల్సి ఉండగా కేవలం 8,500 ఎకరాల్లోనే వివిధ పంటలు సాగవుతున్నాయి. అందులోనూ వరి పంటకు సంబంధించి కేవలం 38 శాతం నాట్లు మాత్రమే పడ్డాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అన్నదాతలు ఆరుతడి పంటలపై దృష్టి సారించారు. వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు ముందుగా ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించారు. పూసపాటిరేగ, భోగాపురం, నెల్లిమర్ల , డెంకాడ మండలాల రైతులు కూరగాయలు, పండ్లు, పూల సాగుపై ప్రధానంగా దృష్టి సారించారు. పూసపాటిరేగ మండల పరిధిలో కుమిలి, రెల్లివలస, పేరాపురం, వెంపడాం, తాళ్లపేట, గోవిందపురం, పూసపాటిపాలెం, కొవ్వాడ అగ్రహారం, గుంపాం, పూసపాటిరేగ, సీహెచ్ అగ్రహారం, పతివాడ, చౌడువాడ గ్రామాలలో కూరగాయల సాగు ఎక్కువగా జరుగుతోంది. తీరప్రాంత గ్రామాలలో బోర్ల కింద మిరప, దొండ, బెండ, బీర, కాకర, క్యాప్సికమ్, టమాటా వంటి పంటలు సాగు చేస్తున్నారు. మండల పరిధిలో సుమారు 800 ఎకరాల్లో వివిధ రకాల ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. నెల్లిమర్ల మండలం టెక్కలి, కొండవెలగాడ, చంద్రమ్మపేట.. భోగాపురం మండలం చాకివలస, తూడెం గ్రామాలలో బంతి, గులాబి, చామంతి, మల్లి, తదితర పూల తోటలు సాగు చేస్తున్నారు. రెండు మూడు నెలల్లో దిగుబడులు చేతికి అందడంతో పాటు ఎరువులు, పురుగు మందులు ఖర్చులు తక్కువ కావడంతో రైతులు కూరగాయలు, పూలతోటలు వైపు మొగ్గు చూపిస్తున్నారు. ఉద్యానవన శాఖ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ తక్కువ విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు.



పూసపాటిరేగ పెట్రోల్‌బంకు సమీపంలో సాగులో ఉన్న టమాటా పంట

ఎన్నో రాయితీలు..

కూరగాయల సాగుకు ఉద్యానవన శాఖ ద్వారా ఎకరాకు ఆరు వేల రూపాయల వరకు రాయితీ కల్పిస్తున్నాం. బంతి, చామంతి, గులాబి, మల్లి వంటి పూలతోటలకు ఎకరాకు రూ. 6400 వరకు రాయితీ వస్తుంది ప్రతి రైతుకూ గరిష్ఠంగా 2.5 ఎకరాలకు రాయితీ వచ్చే అవకాశం ఉంది. ఉద్యానవన శాఖ సహాయకులను కలిస్తే రాయితీల కోసం ఎలా దరఖాస్తు చేయాలో వివరిస్తారు.

– జ్యోత్స్న, ఉద్యానవనశాఖ అధికారి, భోగాపురం

పూలసాగుతో అధిక లాభాలు

పూల సాగులో ఎరువులు, పురుగు మందుల పెట్టుబడి తక్కువ. రెండు నెలల నుంచి చేతికి పంట అందుతుంది. నిత్యం పూలు పూయడంతో సాగు మదుపులకు ఇబ్బంది ఉండదు. ఖరీఫ్ సాగులో వర్షాభావ పరిస్థితుల కారణంగా మదుపు పెట్టినా నష్టం వచ్చే పరిస్థితి కనబడుతోంది. ప్రత్యామ్నాయ పంటలు వైపు దృష్టి సారించడమే మేలు.

– ఎం. నారాయణప్పారావు, రైతు చౌడువాడ